సాక్షి
కర్నూలు

ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



అహోబిలంలో ప్రత్యేక పూజలు

ఆళ్లగడ్డ: మహాలయ అమావాస్యను పురస్కరించుకుని అహోబిలంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వాములతోపాటు అండాల్ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



క్షేత్రపాలకుడికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర పాలకుడు బయలు వీరభద్ర స్వామికి శనివారం అమావాస్య సందర్భంగా పూజలు నిర్వహించారు. లోక క్షేమాన్ని కాంక్షిస్తూ అర్చకులు సంకల్పాన్ని పఠించారు.



ప్రభుత్వ సహకారం భేష్

చేనేత పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం, ప్రోత్సాహం చాలా బాగుందని కేంద్ర ప్రభుత్వం తరఫున జిల్లాకు వచ్చిన ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి హరిప్రీత్‌సింగ్ కితాబిచ్చారు.

10లో▸

న్యూస్‌రీల్

16న 'దిశ' సమావేశం

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశ) కమిటీ సమావేశాన్ని ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. సృజన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు పార్లమెంట్ సభ్యులు డా.ఎస్ సంజీవ్‌కుమార్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలుపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, దిశా కమిటీ సభ్యులు, ఎంపీపీలు హాజరు హాజరు కావాలని కోరారు.

ఉత్సవాలకు వేళాయె!



విద్యుత్‌దీప కాంతులతో శ్రీశైలాలయం

శ్రీశైలంటెంపుల్: దసరా మహోత్సవాలకు శ్రీశైలక్షేత్రం ముస్తాబైంది. ఆదివారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు భ్రమరాంబాదేవి శరన్నవరాత్రోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. సంప్రదాయాన్ని అనుసరించి శాస్త్రోక్తంగా నిర్వహించే ఈ ఉత్సవాలలో అమ్మవారికి నవదుర్గ అలంకారాలు, ప్రత్యేక నవావరణపూజలు, స్వామిఅమ్మవార్లకు వాహనసేవలు, చండీయాగం, రుద్రయాగం జరుగనున్నాయి.

నేడు ఉత్సవాలకు అంకురార్పణ

దసరా మహోత్సవాలకు నాందిగా ఆదివారం ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి, గణపతి పూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షాసంకల్పం, కంకణ పూజ కుంకుమార్చనలు, కుమారి పూజలు జరిపిస్తారు. 9.30 గంటలకు స్వామివారిని యాగశాల ప్రవేశం చేసి వేదస్వస్తి, శివసంకల్పం, రుద్రకలశ స్థాపన, స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నకాలార్చనలు చేస్తారు. సాయంత్రం అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, రుద్రహోమం, అమ్మవారికి నవావరణార్చన, కుంకుమార్చనలు జరిపిస్తారు.

దసరా మహోత్సవాల్లో నేడు

దసరా మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు శ్రీశైల భ్రమరాంబాదేవి శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను భృంగివాహనంలో అధిష్ఠించి ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

రేపు కలెక్టరేట్‌లో 'స్పందన'

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు.

19న ఎమ్మిగనూరుకు సీఎం వైఎస్ జగన్

- హెలిపాడ్, సభాస్థలిని పరిశీలించిన జేసీ, ఎమ్మెల్యే

ఎమ్మిగనూరుటౌన్: జగనన్న చేదోడు పథకం కింద నాలుగో విడత లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని అందజేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19న ఎమ్మిగనూరు పట్టణానికి రానున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో శనివారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఎమ్మిగనూరు పట్టణానికి వచ్చారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డితో కలసి ఏర్పాట్లపై చర్చించారు. హెలిపాడ్ ఏర్పాటు కోసం పట్టణంలోని వెంకటాపురం కాలనీ వద్ద స్పిన్నింగ్ మిల్లు సమీపంలోని మైదానాన్ని పరిశీలించారు. అనంతరం పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ మైదానంలో ఏర్పాటు చేయనున్న సీఎం సభా స్థలిని పరిశీలించారు. బారికేడ్ల ఏర్పాటు, వీఐపీ గ్యాలరీ, పార్కింగ్ తదితర అంశాలపై అధికారులకు జేసీ సూచనలిచ్చారు. శనివారం సాయంత్రం స్థానిక మున్సిపల్ సమావేశమందిరంలో సమావేశం నిర్వహించారు. జగనన్న తోడు పథకం లబ్ధిదారులను సభాస్థలికి తరలించేందుకు బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను జేసీ ఆదేశించారు. ప్రజల నుంచి వినతులు తీసుకునేందుకు గ్యాలరీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, విద్యుత్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈలు ఉమాపతి, నాగరాజు, జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి విజయలక్ష్మి, డీఎస్పీ సీతారామయ్య, సీఐ మధుసుదన్‌రావు, తహసీల్దార్ ఆంజినేయులు, మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, ఆర్టీసీ డీఎం అమర్నాథ్, ట్రాన్స్‌కో డీఈ రాఘవేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సమీక్ష

కర్నూలు (సెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన ఏర్పాట్లపై ఆదివారం ఉదయం 10 గంటలకు ఎమ్మిగనూరులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.



సభా స్థలం కోసం ఎమ్మిగనూరులోని వైడబ్ల్యూసీఎస్ మైదానాన్ని పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తదితరులు

మేలు చేపట్టేలా!



- జిల్లాలో 60 ఫిష్ ఆంధ్ర రిటైల్ అవుట్‌లెట్స్ ఏర్పాటు
- త్వరలో నన్నూరు టోల్‌ప్లాజా, ఎమ్మిగనూరులో ఫిష్ ఆంధ్ర లాంజ్‌లు
- కర్నూలు గ్రాయత్రి ఎస్టేట్, వెల్దుర్తిలో ఏర్పాటు కానున్న సూపర్ యూనిట్లు
- 22 సొసైటీ చెరువుల్లో 19.29 లక్షల చేపల అభివృద్ధికి చర్యలు
- 75 శాతం సబ్సిడీతో వలలు, పడవల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. అలాగే చేపల ఉత్పత్తిని, వినియోగాన్ని పెంచేందుకు కృషి చేస్తోంది. ఈ కోవలోనే ఫిష్ ఆంధ్ర, ఫిట్ ఆంధ్ర నినాదంలో రిటైల్ చేపల అమ్మకం కేంద్రాల ఏర్పాటు చేయిస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు 60 రిటైల్ ఫిష్ అవుట్‌లెట్స్ ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా సముద్రపు చేపలతో పాటు అన్ని రకాల చేపలు, రొయ్యలు అందుబాటులోకి వచ్చాయి. ఇవి వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. కర్నూలులో 11 రిటైల్ అవుట్‌లెట్స్‌కు, కర్నూలు మండలం గార్గేయపురం, దిగువపాడు, గూడూరు, సి.బెళగల్, కల్లూరు మండలం ఉలిందకొండ తదితర ప్రాంతాల్లోని రిటైల్ ఆవుట్‌లెట్స్‌కు విశేష స్పందన లభిస్తోంది.

చేపల పెంపకానికి ప్రోత్సాహం

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని (పీఎంఎంఎస్‌వై) ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నాయి. జిల్లాలోని 22 మత్స్య సహకార సంఘాలు ఉండగా, వాటి పరిధిలోని చెరువుల్లో చేపల పెంపకానికి మత్స్యశాఖ చర్యలు చేపట్టింది. సొసైటీలు 60 శాతం, మత్స్యశాఖ 40 శాతం చేపలను వదులుతోంది. మొత్తం 19.29 లక్షల చేపలను సొసైటీలకు సంబంధించిన 22 చెరువుల్లో వదలాలనేది లక్ష్యం కాగా.. ఇందులో సొసైటీలు 12.68 లక్షలు(60 శాతం), మత్స్య శాఖ పీఎంఎంఎస్‌వై కింద 10.32 లక్షల చేపలను వదులుతున్నాయి. మత్స్యకారులకు 75 శాతం సబ్సిడీపై వలలు, పడవ(బోట్స్)లు సరఫరా చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు మత్స్యకారుల నుంచి డిమాండ్ తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది.

రుణ 'సహకారం'

జిల్లాలో చేపల వినియోగాన్ని గణనీయంగా పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన ఫిష్ ఆంధ్ర కార్యక్రమానికి జిల్లా సహకార కేంద్రబ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తోంది. అలాగే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. త్వరలో ఫిష్ ఆంధ్ర సూపర్ యూనిట్లు కర్నూలు, వెల్దుర్తిలో ఏర్పాటు చేయనున్నారు. యూనిట్ ధర రూ.20 లక్షలు ఉండగా ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. కర్నూలు శివారులోని నన్నూరు టోల్‌ప్లాజా, ఎమ్మిగనూరులో త్వరలో ఫిష్ ఆంధ్ర లాంజ్‌లు ఏర్పాటు కానున్నాయి. యూనిట్ ధర రూ.50లక్షలు ఉండగా.. ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ లభిస్తుంది. ఇవి రెస్టారెంట్‌ల తరహాలో పనిచేయనున్నాయి.



కర్నూలు మండలం సుంకేసుల డ్యామ్ దగ్గర ఏర్పాటైన ఫిష్ ఆంధ్ర కియోస్క్

నోరూరిస్తున్న వంటకాలు

ఫిష్ కియోస్క్ యూనిట్ ధర రూ.10 లక్షలు ఉండగా.. ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు 60 శాతం , ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఉంటుంది. ఇందులో చేపలు, రొయ్యలతో పాటు వీటికి సంబంధించిన వివిధ రకాల వంటకాలు లభిస్తాయి. ఫిష్ కియోస్క్‌లు, ఫిష్ సూపర్ యూనిట్లలో చేపల పులుసు, చేపలు, రొయ్యల వేపుడు, ఫిష్, రొయ్యల బిర్యానీ, రోస్ట్ ఫిష్ చిల్లీ డ్రై, రొయ్యల 65, అపోలో ఫిష్, అపోలో 65 తదితర వంటకాలు లభిస్తాయి. కర్నూలు మండలం సుంకేసుల గ్రామంలో ఫిషర్‌మెన్ మహిళా కో-ఆపరేటివ్ సొసైటీ ఫిష్ కియోస్క్‌ను అద్భుతంగా నిర్వహిస్తోంది. ఈ సొసైటీలో ఉన్న వారందరూ మహిళలే కావడం విశేషం. సుంకేసుల డ్యామ్‌ను సందర్శించడానికి వెళ్లేవారు ఫిష్ కియోస్క్‌లో లభ్యమయ్యే చేపల వంటకాల రుచి చూడకుండా రాలేరు. కర్నూలు ఖానా ఖజానాలో కూడా ఫిష్ ఆంధ్ర కింద కియోస్క్ ఏర్పాటైంది. దీనికి మంచి స్పందన లభిస్తోంది. ఫిష్ కియోస్క్‌ల్లో మరొక యూనిట్‌ను త్వరలో ప్రారంభించనున్నారు.

ఎన్నో ఉపయోగాలు..

చికెన్, మటన్‌తో పోలిస్తే చేపల్లో పోషకాలు అధికంగా ఉంటాయి. షుగర్ వ్యాధిగ్రస్తులు కూడా వీటిని తీసుకోవచ్చు. గర్భిణులు, బాలింతలు చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య నుంచి బయటపడే అవకాశం ఉంది. రోగనిరోధక శక్తిని పెంచుకోవడడానికి చేపలు చక్కగా ఉపయోగపడుతాయి. వీటిలో అనేక పోషకాలు ఉండటం వల్లే ప్రభుత్వం వీటి వినియోగాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

సబ్సిడీతో వివిధ యూనిట్ల మంజూరు

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) కింద రూ.7.65 కోట్లతో 232 యూనిట్లు ఏర్పాటు చేయడానికి కసరత్తు జరుగుతోంది. లైవ్ ఫిష్ వెండింగ్ యూనిట్లు పది మంజూరయ్యాయి. అర్హులైన వారికి ఎనిమిది ఇన్సులేటెడ్ వాహనాలు, ఐస్‌బాక్స్‌తో కూడిన 15 త్రీవీలర్లు, 18 మోటార్ బైక్‌లు, 77 ఫిష్ కియోస్క్‌లు అందించనున్నారు. అలాగే మూడు రిటైల్ ఫిష్ అవుట్‌లెట్స్, మూడు ఫిష్ రిటైల్ మార్కెట్లు ఏర్పాటు చేసేందుకు కసరత్తు సాగుతోంది. ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు 60 , బీసీ, ఇతర మత్స్యకారులకు 40 శాతం సబ్సిడీతో వివిధ యూనిట్లు మంజూరు చేయనున్నారు.



కర్నూలు గాయత్రి ఎస్టేటులో ప్రారంభానికి సిద్ధమైన ఫిష్ ఆంధ్ర సూపర్ యూనిట్

2019-20 నుంచి 2023-24 వరకు చేపలు, రొయ్యల ఉత్పత్తి (టన్నుల్లో)

సంవత్సరం	చేపలు	రొయ్యలు
2019-20	49,623	180
2020-21	54,705	165
2021-22	49,797	120
2022-23	52,466	135
2023-24	8,927	69

(సెప్టెంబరు వరకు)

నికరాదాయం పొందుతున్నాం



సుంకేసుల డ్యామ్ దగ్గర ఫిషర్‌మెన్ మహిళ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఫిష్ ఆంధ్ర కింద కియోస్క్‌ను జూన్ 1న ప్రారంభించాం. ఇందులో అన్ని రకాల చేపలు, రొయ్యలు, పీతలు విక్రయిస్తున్నాం. అంతేగాక వివిధ వంటకాలను తయారు చేసి విక్రయిస్తున్నాం. ఆదివారాల్లో రూ.15వేలపైగా, మిగిలిన రోజుల్లో రూ.10 వేల వరకు వ్యాపారం జరుగుతోంది. అన్ని ఖర్చులు పోనూ నెలకు రూ.50వేల వరకు నికరాదాయం లభిస్తోంది. సొసైటీలో మొత్తం 29 మంది సభ్యులు మహిళలే ఉన్నారు. అందరం కలసికట్టుగా నిర్వహిస్తున్నాం. రెండు, మూడేళ్లతో పోలిస్తే చేపల వినియోగం గణనీయంగా పెరిగింది.

–సునీతమ్మ, చైర్‌పర్సన్, ఫిషర్‌మెన్ మహిళా కో-ఆపరేటివ్ సొసైటీ, సుంకేసుల

చేపల వినియోగాన్ని పెంచుతున్నాం



జిల్లాలో చేపల వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 60 ఫిష్ ఆంధ్ర రిటైల్ అవుట్‌లెట్స్‌ను ఏర్పాటు చేశాం. గతంలో ఏడాదికి సగటు చేపల వినియోగం 8 కిలోలు మాత్రమే ఉంది. దీనిని 30 కిలోలకు పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఫిష్ ఆంధ్ర కింద కియోస్క్‌లు, సూపర్, లాంజ్ యూనిట్‌లను నెలకొల్పేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాం. 75శాతం సబ్సిడీపై వలలు, బోట్‌లు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి.

– శ్యామలమ్మ, జాయింట్ డైరెక్టర్, మత్స్యశాఖ

ప్రజా ధనం లూటీ చేస్తే కేసులు వద్దా?

- తప్పు చేయకపోతే బాబు కోర్టులో నిరూపించుకోవాలి
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రామయ్య



మాట్లాడుతున్న బీవై రామయ్య

కర్నూలు(రాజ్‌విహార్): అధికారాన్ని అడ్డు పెట్టుకొని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజా ధనాన్ని లూటీ చేశారని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య ఆరోపించారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్, రింగ్ రోడ్డు పేరుతో రూ.వందల కోట్ల స్కామ్‌కు చంద్రబాబు తెర లేపారని, అన్ని ఆధారాలు చిక్కడంతోనే సీఐడీ పోలీసులు అరెస్టు చేసినట్లు చెప్పారు. చంద్రబాబును బయటకు తెచ్చేందుకు టీడీపీ నేతలు, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. తప్పు చేయకపోతే న్యాయ స్థానంలో నిరూపించుకోవాలన్నారు. చట్ట ప్రకారమే చంద్రబాబును అరెస్టు చేశారని, దీనికి ప్రభుత్వానికి, వైఎస్‌ఆర్‌సీపీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. టీడీపీ హయాంలో ఎలాంటి అక్రమాలు జరక్కపోతే అప్పట్లో సీబీఐకి ఎందుకు అడ్డుకట్ట వేశారని ప్రశ్నించారు. చంద్రబాబు నేరాల్లో ఆయన తనయుడు లోకేష్ పాత్ర ఉందని, తననీ అరెస్టు చేస్తారనే భయంతోనే ఢిల్లీకి వెళ్లి దాక్కున్నారన్నారు. తమను ఎలాగైనా కాపాడాలని బీజేపీ నేతలతో కాళ్లబేరం ఆడుతున్న టీడీపీ అధిష్ఠానం.. తమ పార్టీ నాయకులను సైతం బీజేపీలోకి పంపించేందుకు వెనుకాడబోదని తెలిపారు. టీడీపీ న్యాయవాదులు ప్రభుత్వ లాయర్లపై భౌతికదాడులకు పాల్పడడం విచారకరమన్నారు. 2024 ఎన్నికల తరువాత ఆ పార్టీకి పుట్టగతులు ఉండబోవని, మేలు చేస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, పార్టీ నాయకులు ధనుంజయ ఆచారి, గౌతం, యూనుస్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్‌ఐ మెయిన్స్ రాత పరీక్ష





పరీక్షా కేంద్రాల్లో తనిఖీ చేస్తున్న డీఐజీ సెంథిల్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: రాయలసీమ జోన్ పరిధిలో ఎస్‌ఐ మెయిన్స్ రాత పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. 8,521 మంది అభ్యర్థులకు గాను 8,396 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరగనున్న ఎస్‌ఐ మెయిన్స్ ఫైనల్ రాత పరీక్షలకు కర్నూలులో 14 కేంద్రాలు ఏర్పాటు చేశారు. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, కర్నూలు, అనంతపురం జిల్లాల ఎస్పీలు కృష్ణకాంత్, కె.కె.అన్బురాజన్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ సంయుక్తంగా 14 పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. మొదటి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పేపర్-1, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరిగింది. ఆయా రూట్లలో స్ట్రాంగ్ రూమ్‌లు పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో అన్ని రకాల భద్రత చర్యలు చేపట్టారు. హాజరైన వారిలో పురుష అభ్యర్థులు 7,537 మంది, మహిళా అభ్యర్థులు 859 ఉన్నారు. 107 మంది పురుష అభ్యర్థులు, 18 మంది మహిళా అభ్యర్థులు కలిపి మొత్తం 125 మంది గైర్హాజరయ్యారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద నిర్ణీత సమయం కంటే గంట ముందు నుంచే విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ డిజిటల్ పరికరాలను అనుమతించలేదు. పరీక్ష కేంద్రాల చుట్టూ వంద మీటర్లలో ఉన్న జిరాక్స్ సెంటర్లను పోలీసులు మూసివేయించారు. హాల్‌టిక్కెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి వాటిలో ఏదో ఒకటి ఉన్న వారిని మాత్రమే పరీక్ష రాసేందుకు అనుమతించారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు వంటి వాటిని కూడా ఆయా కేంద్రాల గేట్ల వద్దనే సీజ్ చేసి అభ్యర్థులను లోపలికి పంపారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా డీఎస్పీ స్థాయి అధికారులు పరీక్ష కేంద్రాల వద్ద పర్యవేక్షించారు.

నేడు కూడా ఎస్‌ఐ పరీక్ష..

రెండు రోజుల పాటు జరిగే ఎస్‌ఐ రాత పరీక్షల్లో మొత్తం నాలుగు పేపర్లు ఉంటాయి. రెండు పేపర్లు డిస్క్రిప్టివ్ టైప్, మరో రెండు పేపర్లు ఆబ్జెక్టివ్ టైప్ ఉంటాయి. రెండో రోజు ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పేపర్-3, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్-4 పరీక్ష జరగనుంది.

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

కర్నూలు (అర్బన్): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ ఆదివారం జిల్లాకు రానున్నారు. మధ్యాహ్నం 3:45 గంటలకు మండల కేంద్రమైన మద్దికెరకు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. 16వ తేదీన ఉదయం 9 గంటలకు ఆయన కౌతాళం మండలం ఎరిగేరి గ్రామానికి చేరుకుని అక్కడినుంచి బైక్ ర్యాలీగా కామవరం గ్రామానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు అక్కడినుంచి బయలుదేరి విజయవాడ వెళ్తారు.

ఆన్‌లైన్‌లో దసరా ప్రత్యేక బస్సుల వివరాలు

కర్నూలు(రాజ్‌విహార్): దసరా సందర్భంగా నడపే ప్రత్యేక బస్సుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు రోడ్డు రవాణా సంస్థ కర్నూలు–2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవుల్లో దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఆన్‌లైన్‌లో ముందస్తు టికెట్లు పొందవచ్చని పేర్కొన్నారు. ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలే ఉంటాయని, రానుపోను టికెట్లు ఒకేసారి పొందితే చార్జీల ధరల్లో 10శాతం రాయితీ ఉంటుందని తెలిపారు.

21న సీపీటీ పరీక్ష

కర్నూలు(సెంట్రల్): జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టుకు షార్ట్‌లిస్టులో ఎంపికైన 108 మందికి ఈనెల 21న కంప్యూటర్ బేస్డ్ సీపీటీ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఆర్వో కె.మధుసూదనరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 21వ తేదీ ఉదయం 10.30 గంటలకు టెస్టు ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు 9.45 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

చేనేతకు ప్రభుత్వ సహకారం భేష్

- ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి హరిప్రీత్‌సింగ్

కర్నూలు(అగ్రికల్చర్)/ఎమ్మిగనూరుటౌన్/కోడుమూరు రూరల్: చేనేత పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం, ప్రోత్సాహం చాలా బాగుందని కేంద్ర ప్రభుత్వం తరఫున జిల్లాకు వచ్చిన ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి హరిప్రీత్‌సింగ్ అన్నారు. జిల్లాలో ఉత్పత్తి అవుతున్న చేనేత పట్టు చీరలకు జాతీయ స్థాయి అవార్డు పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని పేర్కొన్నారు. శుక్రవారం కర్నూలుకు వచ్చిన ఆయన శనివారం కోడుమూరు, ఎమ్మిగనూరుల్లో ఒక జిల్లా, ఒక ఉత్పత్తి కింద చేనేత పట్టు చీరల తయారీ పరిశీలించారు. ముందుగా ఆయన కర్నూలులో చేనేత, జౌళి శాఖ అధికారులతో సమావేశమై పట్టుచీరల తయారీ, మార్కెటింగ్, ప్రభుత్వ ప్రోత్సాహం తదితర వాటిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన కోడుమూరులో చేనేత పట్టుచీరల తయారీని పరిశీలించారు. చేనేత కార్మికులతో ముఖాముఖి మాట్లాడారు. చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ.24 వేలు అందచేస్తోందని లబ్ధిదారులు వివరించారు. అనంతరం ఎమ్మిగనూరులో చేనేత సహకార సంఘం ఉత్పత్తి చేసిన వస్త్రాలను పరిశీలించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. పట్టు చీరల తయారీ ఎంతో కళాత్మకంగా ఉందని ప్రశంసించారు. కేంద్రప్రభుత్వ ప్రతినిధి హరిప్రీత్‌సింగ్ వెంట జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ హరికృష్ణ, చేనేత అభివృద్ధి అధికారి నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.



మగ్గంపై నేసిన పట్టుచీరను పరిశీలిస్తున్న హరిప్రీత్‌సింగ్

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- 10.77 లక్షల నగదు, 3 కేజీల గంజాయి, 2 సెల్ ఫోన్లు స్వాధీనం

బొమ్మలసత్రం: బస్సులో ప్రయాణికుల నుంచి డబ్బు చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10.77 లక్షల నగదు, 3 కేజీల గంజాయి, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దొంగల వివరాలను ఎస్పీ కార్యాలయంలో శనివారం అడిషన్ ఎస్పీ వెంకటరాముడితో కలిసి ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామానికి చెందిన గొల్ల సంజన్న ఉల్లిగడ్డల వ్యాపారం చేస్తున్నాడు. ఈనెల 6న మూడు లారీల ఉల్లి గడ్డలను పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మార్కెట్‌లో విక్రయించాడు. రూ.11 లక్షలు రాగా బ్యాగులో వేసుకుని విజయవాడ నుంచి అనంతపురం వెళ్లే ఇంద్ర బస్సులో స్వగ్రామానికి బయలుదేరాడు. బస్సు గుంటూరుకు చేరుకోగానే యూపీ రాష్ట్రానికి చెందిన ఇక్రమ్, వసీమ్‌లు బస్సు ఎక్కి సంజన్న వెనుక సీట్లో కూర్చున్నారు. సంజన్న తన బ్యాగును పదేపదే గమనిస్తూ ఉండటంతో వెనక సీట్లో ఉన్న ఇద్దరూ గమనించి పెద్ద మొత్తంలో నగదు ఉందని నిర్ధారించుకున్నారు. సంజన్న నిద్రలోకి జారుకోగానే నగదు ఉన్న బ్యాగును తీసుకుని దోర్నాల వద్ద దిగి పారిపోయారు. కొంత సేపటికి సంజన్న నిద్ర లేచి చూడగా బ్యాగు కనిపించలేకపోవడంతో ఆత్మకూరు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి పట్టణ శివారులో అనుమానస్పదంగా తిరుగుతున్న ఇక్రమ్, వసీమ్‌లను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించారు. వారి నుంచి రూ.10,77,500 నగదు, 3 కేజీల గంజాయి, 2 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాగభూషణ్, సీఐలు రామకృష్ణ, సాదిక్ అలి, ఎస్ఐ వెంకటప్రసాద్, హెచ్‌సీ బాలకృష్ణలను ఎస్పీ అభినందించారు.















యువకుడి బలవన్మరణం



నరసప్ప(ఫైల్)

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం వాల్మీకి నగర్‌కు చెందిన బోయ నరసప్ప(33) శుక్రవారం అర్ధ రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం విషయం తెలుసుకున్న రైల్వే ఎస్ఐ రామస్వామి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆదోని–ఇస్వి అర్ఎస్‌ల మధ్యలో గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మానసిక స్థితి సరిగా లేక ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరో ఇద్దరికి గాయాలు

కొలిమిగుండ్ల: నాగిరెడ్డిపల్లె–హనుమంతుగుండం గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సంజామల మండలానికి చెందిన నీలి శ్రీనివాసులు(51) మృతి చెందాడు. అదే మండలానికి చెందిన మరో ఇద్దరు గాయపడ్డారు. పేరుసోములకు చెందిన నజీర్ కొలిమిగుండ్ల మండలం బెలుం సమీపంలోని నాపరాతి గనుల్లోంచి రాళ్లను ప్రొద్దుటూరుకు చేర్చేందుకు లోడింగ్, అన్‌లోడింగ్ కోసం గిద్దలూరుకు చెందిన శ్రీనివాసులు, రామభద్రునిపల్లెకు చెందిన గోపాల్‌ను మాట్లాడుకున్నాడు. గనిలో రాళ్లను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని బయలు దేరారు. మార్గమధ్యలో నాగిరెడ్డిపల్లె దాటగానే బళ్లారి నుంచి జమ్మలమడుగు వైపు వెళ్తున్న లారీ అతి వేగంగా ట్రాక్టర్ వెనుక భాగాన ఢీకొంది. ట్రాక్టర్ బోల్తా పడటంతో నాపరాళ్లు చెల్లాచెదురుగా పడ్డాయి. ఇంజిన్‌పై కూర్చున్న శ్రీనివాసులు తీవ్రంగా గాయపడగా డ్రైవర్ నజీర్, గోపాల్ స్వల్పగాయాలతో బయట పడ్డారు. ముగ్గురిని చికిత్స నిమిత్తం జమ్మలమడుగు ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక శ్రీనివాసులు మృతి చెందాడు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్ఐ రమేష్‌రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.